**BOOK - II**

# సదువు

"నేను సదువుకోను" కన్నీళ్లు ధారకడ్తుంటే వెక్కుతూ ఏడ్చాడు గంగధరి.

"మల్ల ఆ మాటంటే సంపుత గాడ్దె కొడుక" కట్టెతో మళ్లీ ఒక్కటి వేయబోయాడు తండ్రి ఎల్లయ్య. ఆ దృశ్యం తన యింటిముందు జరగడం ఇష్టంలేక ఎల్లయ్యను వారించి గంగధరిని అక్కున చేర్చుకున్నాడు ఆ వూరి స్కూలు టీచర్ లచ్చయ్యసారు.

నల్లటి గంగధరి లేత శరీరంమీద అప్పటికే వాతలు తేలినట్టు గమనించాడు లచ్చయ్య. "నీ కొడుకు స్కూలుకు సరిగ వస్తలేడు" అని నిన్న ఎల్లయ్యను స్కూలుకు పిలిచి చెప్పిన ఫలితం ఇది. తానే గంగధరిని కొట్టించినట్టనిపించి లచ్చయ్య మనస్సు విలవిల్లాడింది.

గంగధరి అంటే లచ్చయ్యకు ఎంతో అభిమానం. అతను ఆ వూరికి వచ్చేనాటికి గంగధరి పేరు స్కూల్లో గంగయ్య అని ఉండేది. లచ్చయ్యే గంగాధర్ అని మార్పించాడు. గతంలో గంగధరి చదువంటే ఎంతో ఉత్సాహంగా ఉండేవాడు. మార్కులు కూడా బాగానే తెచ్చుకునేవాడు. ఈయేడే గంగధరి ఇలా మారిపోయాడు.

"నీల్లు సల్లారి పోతున్నై" అంటూ ముగ్గురికి చాయ్ తెచ్చింది లచ్చయ్య భార్య మల్లవ్వ. పెట్టిన పేరు మల్లవ్వయినా మల్లేశ్వరి అని పిలుస్తాడు లచ్చయ్య.

ఆ వూరికొచ్చిన్నుంచి ఎల్లయ్య మల్లేశ్వరికి దగ్గరివాడయ్యాడు. పొయ్యిల కట్టెల కాన్నుంచి ఏది కావాలన్నా ఎల్లయ్యకి చెప్తే జాడతీసి బేరం చేసి పంపించేవాడు. గంగధరి కూడా ఆ ఇంటికి అలివి అయినవాడే.

గంగధరి చాయ్ తీస్కోలేదు. "చాయ్ ఏమన్నది బిడ్డా! తీస్కో" అని బతిమాలింది మల్లేశ్వరి. తీసుకొని పక్కన పెట్టుకొని వెక్కుతున్నాడు గంగధరి. చాయ్ తాగి "స్నానం చేసి ఇపుడే వస్త" అంటూ అంపుల పొరకల దడికేసి నడిచాడు లచ్చయ్య. అదే వాళ్ల స్నానాలగది.

స్నానం చేసి డ్రెస్ వేసుకొని తల దువ్వుకుంటుండగా "నన్ను సంపినా సరే నేను సదువుకోను పో" అంటూ గంగధరి అకస్మాత్తుగా అక్కణ్నుంచి పారిపోయాడు. అతని కాళ్లకింద చాయ్‌గ్లాసు తగిలి కనకనమంటూ వాకిట్లో అంతదూరం పొర్లిపోయింది. గంగాధరి ఎల్లయ్యకు అందలేదు.

లచ్చయ్య పరుగున వచ్చాడు. "నువ్వు వాణ్ణి మల్లేమనకు. నాలుగైదు రోజుల్లో వాన్ని నేనే సముదాయిస్త తియి" అని ఎల్లయ్యను సముదాయించి పంపాడు లచ్చయ్య. ఈ ఏడు గంగధరికి చాలాసార్లు జ్వరం వచ్చింది. విరేచనాలు పట్టుకున్నాయి. సకాలంలో పెద్ద డాక్టరుకు చూపలేదు. దాంతో చాల్రోజులు బడికి రాలేకపోయాడు. అయినా పాతాలను అందుకోగల స్థాయి ఉన్నవాడే. తన స్వేచ్ఛకేదో అడ్డంకిగా ఈ చదువూ నోట్సూ మారిందనుకున్నాడేమో. ఈ పాఠ్యపుస్తకాలు పట్టణవాసపు అగ్రకులాల మధ్య తరగతి పిల్లలకోసం రాసినట్లుంటాయి. పల్లెటూరి పిల్లలకు, అందునా దళితులకు అవి ఏమాత్రం ఆసక్తిలేని విధంగా ఉంటాయి. చిన్నప్పుడు తానూ ఎదుర్కొన్నాడీ సమస్య. ఇప్పుడు దీని పరిష్కారం తన చేతుల్లో లేదు. కుర్రాడు ఎలాగోలా ఇంటర్ దాకా గట్టెక్కితే ఆ తర్వాత చదువుబండి ఎంతదాకైనా సాగిపోతుంది.


లచ్చయ్యకు సారుకు చిన్నప్పుడు గంగధరి వంటి అనుభవాలు లేకపోలేదు. అయితే అవి అతని అన్న నర్సన్నవి. నర్సన్న ఇదే వయసులో ఇలాగే చేశాడు. నాయిన్న, అవ్వ గంగధరి తండ్రి ఎల్లయ్య, తల్లి బూదవ్వల్లాగే ప్రవర్తించారు. ఆరాటపడ్డారు.

"నేను బడికి పోనుపో" అని మొడికేసిన నర్సన్నను ఎన్నో హింసలు పెట్టారు. ఇల్లును పోలీస్ లాకప్‌లా మార్చారు. తొడపాశం పెట్టారు. కోదండం అని దూలానికి తలకిందులుగా వేలాడదీసి కొట్టారు. తిండికి ఎండబెట్టారు. ఊరూవాడా అంతా అతన్ని అవమానించారు. మంత్రం చేశారని దిష్టి తీశారు. గుండు కొట్టించి నిమ్మకాయలు పగిరా రుద్దారు. అలా చేసినకొద్దీ మరింత మొండికేశాడు. మొండివాడు అన్నారు. పిచ్చివాడు అన్నారు. కొన్నాళ్లు ఎటెటో తిరుగుతూ ఇంట్లో ఎవరూ లేనివేళకొచ్చి తిని వెళ్లేవాడు. ఎక్కడెక్కడో పడుకునేవాడు. అన్నను కొట్టిన దెబ్బలు చూసే భయంతో తాను బడికి వెళ్లాడేమో. చదువు గురించి ఎందుకింత హింస?

విశ్వకవి రవీంద్రుడు పద్నాలుగేళ్లదాకా చదువనేది లేకుండా స్వేచ్ఛగా తిరిగాడట! చదువు గురించి ఒత్తిడి లేనందువల్లే టాగోరు విశ్వకవి అయ్యాడేమో. అందుకే ఆయన స్వేచ్ఛాయుత విద్యకోసం శాంతినికేతన్ స్థాపించాడేమో. నర్సన్న కూడా టాగోర్‌కున్న అవకాశాలుంటే గొప్ప రచయిత అయ్యేవాడేమో. నర్సన్నకు కథలు చెప్పడం, శాస్త్రాలు విప్పడం (పొడుపు కథలు) భలే వచ్చు. ఎంతోమంది పిల్లల్ని ఆకర్షించేవాడు. ప్రకృతి, చెట్లు, చేమలు, చెరువులు, కాల్వలు అంటే అన్నకు భలే ఇష్టం.

కొన్నాళ్లు చూసి కులవృత్తి నేర్చుకొమ్మని పోరుపెట్టారు నాయిన్న. నాయిన్న ప్రవర్తనతో నాయిన్న చెప్తే ఏదీ వినవద్దు అనే భావన నర్సన్నలో బలంగా నాటుకుపోయింది. "నన్ను సంపు" అని హింసలకు ఏడ్చాడుగానీ అటు చదువుకు పోలేదు, ఇటు కులవృత్తి నేర్చుకోలేదు.

నర్సన్న భలే సాహసి. చేన్లు చెలకల వెంట ఏదేదో ఏరుక వచ్చేవాడు. ఎన్నో రకాల పండ్లు తెచ్చేవాడు. కట్టెలు తెచ్చేవాడు. చేపలు పట్టుకొచ్చేవాడు.




అరిచేతిలో బొంగరాల్ని తిప్పడంలో ఎంత బాగా విన్యాసాలు చేసేవాడో. అందరం నీళ్లల్లో పాములకు, తీగలకు భయపడితే నర్సన్న సాహసంగా వెళ్లి మొగిలి, తామర, కలువలు తెచ్చిఅమ్మేవాడు.

ఓరోజు నర్సన్నను గుంజకు కట్టేసి కులవృత్తి నేర్చుకొమ్మని కొట్టాడు నాయిన్న. తిండి పెట్టలేదు. స్పృహ కోల్పోయాడు. అవ్వ కారం గడుక తినిపించవోతే అవ్వను కొట్టాడు. ఓ రాత్రి అవ్వ లేసి అన్నకు తినిపించి కట్లు యిప్పి "ఎవలన్న సుట్టాలింటికి పో. ఎటువోకు బిడ్డా!" అని కాళ్లు మొక్కి సాగనంపింది. నాయిన్న అవ్వను కొట్టాడు. అవ్వ మూడ్రోజులు లేవలేదు. తమ కులవృత్తికన్నా చదువుకోవడమే అల్కగ. కానీ

నర్సన్నకు రెంటిమీదా యిష్టంలేదు.

ఆ తర్వాత వారం రోజులకు నర్సన్న జాడలేకుండా పోయాడు. ఏ చుట్టాల యింట్లో ఏ పూర్లోనూ లేడని తెల్సింది. పారిపోయాడన్నారు. ఏ బావిలోనో, చెరువులోనో పడి చనిపోయాడేమో అన్నారు. అవ్వ ఏడ్చుకుంటూ అవన్నీ తిరిగింది. ఎక్కడా జాడలేదు. ఎవరూ అన్న జాడ చెప్పలేకపోయారు.

కొన్నాళ్లకు నర్సన్న నిజామాబాద్‌లో కనపడ్డాడన్నారు. ఏదో హోటల్‌లో సప్లయర్‌గా కనపడ్డాంటే అవ్వ పోరుతో నాయిన్న బస్సు కిరాయిలు జమచేసుకొని పనీతీరుబడి చేసుకొని జాడకు వెళ్లేసరికి అక్కడ పని మానేసి వెళ్ళిపోయాడన్నారు. ఓసారి జాల్నాలో కనపడ్డాడన్నారు. ఎవరో భీవండిలో కనపడ్డాడన్నారు. మరెవరో బొంబాయిలో మిల్లు కార్మికులకు సద్దులు మోసేపని చేస్తున్నాడన్నారు. ఇంకెవరో మిల్లులో కండెలు చుట్టేపనికి కుదురుకున్నాడన్నారు. పవర్ లూమ్స్ నేస్తున్నాడన్నారు. మంచి మెకానిక్ అయ్యాడన్నారు. ఏవేవో వినడమేగాని నర్సన్న నుండి ఉత్తరం వచ్చేది కాదు.

అన్న ఏ పనిలో నెగలడు. ఎవరివద్దా నెగలడు అని పేరు తెచ్చుకున్నాడు. కానీ అన్న మోసం చేశాడని గాని, అప్పు తీసుకున్నాడని గాని, ఎగవెట్టాడని గాని ఎవరూ వార్తలు తేలేదు. ఎవరి దాష్టీకాన్ని సహించేవాడు కాకపోవడంతో ఎవరివద్దా ఎక్కువకాలం పనిలో ఉండేవాడు కాదు.

ఓసారి ఇంటికొచ్చి ఇక ఇటే వుంటానంటే పెళ్లి చేశారు. ఇదో గుదిబండ అనుకొని వదినను ఇంటికాడనే వదిలేసి చెప్పా పెట్టకుండా దేశం (ప్రవాసం) పోయాడు. విసిగివేసారి వదినకు విడాకులు తీసుకుని రెండో పెళ్లి చేశారు. ఆ తర్వాత అన్న ఎవర్నో మరాఠా స్త్రీని ఉంచుకున్నాడన్నారు. ఆ తర్వాత ఆమెతో విడిపోయాడని వార్త. ఎవరి భార్యనో లేపుకుపోయాడని మరి కొన్నాళ్లకు వార్త. ఆ తర్వాత అన్నను ఎవరో కొట్టిచంపి బొంబాయి అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో పారేసారన్నారు. పండరిపురంలో షిర్డీసాయి ప్రాంతంలో కనపడ్డాడన్నారు. సూరత్‌లో పనిచేస్తున్నాడన్నారు. ఆ తర్వాత మరే వార్తలూ అందలేదు. స్వేచ్ఛ కోరుకున్న అన్న జీవితం అలా ముగిసిపోయింది. సామాజిక బంధాలంటే కొందరికి ఎందుకింత ద్వేషమో. సామాజిక బంధాలకతీతంగా స్వేచ్ఛ వుంటుందా? ఒకరికి స్వేచ్ఛ అధికారికంగా, మరొకరి బరువు నిర్బంధంగా మారడంవల్లే సామాజిక బంధాల్ని ద్వేషిస్తారేమో.

అన్నను పిచ్చివాడన్నారు. రవంత ఆర్ద్రత, కాసింత ఉల్లాసం, స్వేచ్ఛ ఉండే చదువైనా, కులవృత్తయినా అన్న ఎంత ఎదిగి ఉండేవాడో. టీచర్ల శాడిస్టు స్వభావం, సమాజ మూర్ఖత్వం మూఢ విశ్వాసాలు కల్సి భావవ్యక్తీకరణ సంతరించుకోని నర్సన్న వంటివారి స్వేచ్ఛ, సృజనాత్మకతని, ఆశలు, ఆరాటాల్ని సమాజ విలువలకు, కులవ్యవస్థకు లొంగలేదని సమాజం ఎంతగా అణిచివేసిందో, ఎందర్ని అణిచివేసిందో! గంగధరిలో పునర్జన్మ ఎత్తుతున్న నర్సన్న స్వభావాన్ని ఈ కాలంలోనైనా సరైన రీతిలో అభివృద్ధి పర్చుకునే అవకాశాలు లేవా? అన్నలా గంగధరి మారకుండా తానేమీ చేయలేడా?

గంగధరిది సున్నితమైన మనస్సు. ఇట్టే బాధపడిపోతాడు. పైకి చెప్పడు. గంగధరి చెట్లు, చేమల్ని ప్రేమిస్తున్నాడు. అన్నలాగే కాలవల వెంట, చెరువుల వెంట తిరుగుతాడు. చేపలు తెస్తాడు. ఇంట్లోని మూడు మేకపిల్లల్ని తోలుకొని గుట్టలవెంట, చెట్లవెంట అదేపనిగా తిరుగుతాడు. ఏవేవో పదాలు అల్లి పాటలు పాడుతుంటాడు. కవి అయ్యే లక్షణాలున్నాయి. కానీ చదువుకోనిదే ఎలా? టాగోరు కవి కావడం వేరు. గంగధరికి ఆ అవకాశాలున్నాయా?

నర్సన్న గుర్తు రావడంతో విషాదంతో మనస్సు ఏదోలా అయి బడికి లేటయిందని సెలవు చీటి పంపాడు లచ్చయ్యసారు. ఇంత తిన్నాననిపించకుకుని లక్ష్యరహితంగా ఊరి చేన్లవైపు నడిచాడు. అక్కడక్కడా స్త్రీలు ఏవో పదాలు పాడుకుంటున్నారు. అందమైన తోటలు, పొలాలు, కందిచేను వాసన కమ్మగా వస్తుంటే కొన్ని కాయలు తెంపుకోబోయి సంస్కారం అడ్డొచ్చి ఆగిపోయాడు లచ్చయ్య. గట్లవెంట బంతిపూలు విరగబూసి కాంతులీనుతున్నాయి. అలా ఎంతసేపు తిరిగాడో! పొద్దు వంగేవేళకు శ్రీరాంసాగర్ పిల్లకాల్వ గట్టుమీద కూర్చుని ఏవో పదాలు పాడుకుంటూ మేకల్ని నీళ్లు తాగమంటూ బుజ్జగిస్తున్న గంగధరి కనపడ్డాడు. గంగధరినే గమనిస్తూ అతని కంటపడకుండా పొదలు చాటుచేసుకుని చీకటి పడుతుండగా ఇంటికి చేరాడు లచ్చయ్యసారు.

ప్రకృతి ఏకాంతంలో మనిషికి ఇంత ఆనందం ఉంటుందా? ప్రకృతిలో ఇంత స్వేచ్ఛ ఉందా? తన శరీరం, మనస్సు ఎంత తేలికైపోయాయి. తనను ఈ ప్రకృతికి దూరం చేస్తున్నదని గంగధరి ఈ చదువు వద్దంటున్నాడా? సొంత చేన్లులేని ప్రకృతి ప్రేమ గంగధరిని వ్యవసాయ కూలీగా మారుస్తుందేమో. వ్యవసాయ కూలీలు, పాలేర్లు ప్రకృతిలో ఇంత స్వేచ్ఛను, ఆనందాన్ని పంచుకుంటారా? ఏవేవో ఆలోచిస్తూ అన్యమనస్కంగా భోంచేసి ఆ రాత్రి నిద్రపోయాడు లచ్చయ్యసారు.

మరుసటిరోజు పొద్దున్నే తల్లి బూదవ్వ దీనవదనంతో లచ్చయ్యసారు ఇంటికొచ్చింది. "కొడుకు రాత్రి ఇంటికి రాలేదు సారూ! మేకలు ఇల్లు చేరినై. వాడు పగలు గూడ ఇంటికి రాలేదు. ఏ యాలకన్నా వచ్చి తింటడని తాళం గూడ వెయ్యలే. నా కొడుక్కు ఏమైంది సారు! చెప్పిన పనల్ల చేస్తనే ఉండే. అన్నిట్ల ఉషారే ఉండె. ఆల్ల నాయిన్న వీన్ని కొట్టకుండ సూడుమ్రి. వీడు ఎక్కడికి పారిపోకుండా సూడుమ్రి బాంచెన్" అని కంటనీరు పెట్టింది.

"నువ్వేం బాధపడకు. వాని బాధ్యత వదిలిపెట్టు. కొంతకాలం బడికి రాకపోయినా మీరేమనకుమ్రి. బడికి పోతున్నట్టే ప్రేమగ చూడుమ్రి. వాడే బుద్ధికస్తడు. బడికి రాకపోతే ఏమైతది. పది, ఇంటరు, డిగ్రీ ఏదైనా ప్రైవేటుగా ఫీజుకట్టి పాసుగావచ్చు. వానికి శ్రద్ధ కలిగితే ఏ వయసులోనైనా సదువుకోవచ్చు" అన్నాడు లచ్చయ్యసారు అనునయంగా. అప్పట్నుంచి గంగధరి స్వేచ్ఛాజీవి అయ్యాడు.

ఏదో పనిమీద హైదరాబాద్ పోయినపుడు విద్యావ్యవస్థ గురించి గురించి రాసిన పలు తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలు తెచ్చుకొని పరిశీలించటం మొదలెట్టాడు లచ్చయ్యసారు.

కథా నిలయం
5566
శ్రీకాకుళం




అవి చదువుతున్నకొద్దీ కొత్త అనుమానాలు రాసాగాయి. ఒకటో తరగతిలో చేరే ప్రతి పదిమందిలో ఒకరిద్దరే పదో తరగతిదాకా రావడానికి మిగతావారు రాలేపోవడానికి పేదరికంకన్నా 'నర్సన్న, గంగధరి ఫ్యాక్టర్' కారణమేమోనని అనుమానం తొలచసాగింది. క్రమంగా ఆ భావన స్థిరపడసాగింది. జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో సెమినార్ జరిగినపుడు లచ్చయ్యసారు ఇదే విషయం లేవనెత్తాడు.

ఓ పెళ్లిలో బి.ఈడి. కాలేజీ లెక్చరర్ తన పాత మిత్రుడు లక్ష్మయ్య కల్సినపుడు చర్చకు దించాడు. ఆ చర్చపట్ల చాలామంది ఆసక్తి కనపరిచారు. ఈ పాఠశాల వ్యవస్థతో పని లేకుండా జిడ్డు కృష్ణమూర్తి చెప్పినట్టుగానీ, మరొకరు చెప్పినట్టు గానీ స్వయంగా విద్య నేర్చే అవకాశాలు సాధ్యమేనా? బడికిపోనివాళ్లను ఏ పనికీ పెట్టకుండా ఇరవై ఏళ్ల వయసుదాకా వారిని కనిపెడుతూ టాగోర్‌లా స్వేచ్ఛగా తిరగనిస్తే వారి వికాసం హెచ్చుతుందా? ఎంత డబ్బున్న తల్లిదండ్రులైనా పిల్లల్ని అందుకు అంగీకరిస్తారా? ఓవైపు భోజనాలు సాగుతోంటే మరోవైపు ఆసక్తికరమైన ఈ చర్చ జరుగుతోంది.

"ఉన్నమాట చెప్పాలంటే నేటి పాఠశాల విద్యావ్యవస్థ పిల్లల సృజనాత్మకతకు, స్వేచ్ఛకు, వారి ఇష్టాలకు తగు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. స్వీయ వ్యక్తీకరణ శక్తిని అణిచివేసి వారిని రిలే కేంద్రాలుగా మారుస్తోంది. వారిని ఒక టేపు రికార్డరులా, ఒక రేడియో, టివి రిలే కేంద్రంలా మార్చుతున్నాం. నీవు చెప్పింది నీకు అప్పగించడం, పాఠ్యాంశాలకు జవాబు రాయడం ఇవన్నీ మనిషిలోని శ్రద్ధాసక్తుల్ని, సృజనాత్మకతని అణిచివేయడమే కదా! కేవలం లిపి నేర్చుకోవటం కోసం అన్నేళ్లు చదువుకోవలసిన పనిలేదు. తన తోవలో తాను పోయేవాణ్ణి పిలిచి మరీ చెంపమీద కొట్టినట్టు దళితుల్ని పాఠశాల కంటూ రప్పించి నీ మెదడు మొద్దురాచ్చిప్పని ముద్రవేసి అణిచివేస్తోందీ వ్యవస్థ" నిష్కర్షగా అన్నాడు లక్ష్మయ్య.

"అంటే బడిలో నేర్చుకునేదేదీ జీవితానికి పనికిరావడంలేదనా?"

"నేను అలా అనడం లేదు. ఈ వ్యవస్థ ప్రకారం పాఠంలో ఏంవుందో అదే పిల్లలు వ్యక్తీకరించాలి. పాఠం చదివాక పిల్లలకు కలిగే కొత్త భావాలను వ్యక్తీకరించే అవకాశం ఈ విద్యావ్యవస్థలో లేదు, ఇదొకటి. రెండోది: కొందరికి విషయం అర్థం అవుతుంది కానీ వ్యక్తీకరించటం రాదు. మూడోది: కొందరు పాఠాల్లోని కొన్ని విషయాల్ని హృదయంలోనే దాచుకోవాలనుకుంటారు. అసలు సృజనాత్మకతను, వ్యక్తీకరణ శక్తిని కక్కు కక్కు అని అనివార్యం చేయడమే సరైంది కాదు. అది అతనిలోనే వుండి అతను నిండుగా స్పందిస్తూ ప్రవహిస్తాడు, ఏం? అతని వ్యక్తిత్వం నిండుగానే ఉంటుంది కదా! ఉదాహరణకు మూగవారు. నీవు చెప్పిందాన్ని పిల్లలు తిరిగి అప్పజెప్పాలని కోరడం సృజనాత్మకత ఎలా అవుతుంది? నీవు నీ పాఠానికనుగుణంగా పిల్లల్ని మరబొమ్మలుగా మార్చుతున్నావు. సరిగ్గా చెప్పాలంటే పాఠాన్ని అప్పగించాలి అనేంత నిర్బంధం మరొకటి లేదు. ఏమంటే పాఠంలోని భావాల్ని తన భావాలుగా 'అంగీకరిస్తే' తప్ప పిల్లలు సరిగా వ్యక్తీకరించలేరు. పిల్లల భావాలకు విరుద్ధంగా నీ భావాలు లేదా నీ పాఠం ద్వారా చెప్పే భావాలు వారిపై నిర్బంధ భావాలుగా రుద్దబడ్డం లేదా?" చిన్నపాటి ఉపన్యాసమే ఇచ్చాడు లక్ష్మయ్య. గంగధరి విషయం చెప్పాడు లచ్చయ్య సారు.


"పేదరికం అన్నింటికీ ఆటంకమే. టాగోరు గానీ, జిడ్డు కృష్ణమూర్తి గానీ, బుద్ధుడు గానీ పేదరికం లేకుండా పెరిగారు కనుక స్వేచ్ఛ విలువను చెప్పగలిగే స్థాయికి, ఇతరులను అందుకు ఒప్పించగలిగే స్థాయికి ఎదిగారు. గంగధరి పుట్టిన కులంవల్ల, పేదరికంవల్ల అతనికా అవకాశం లేదేమో" అన్నాడు లక్ష్మయ్యసారు.

"ఇలాంటి వారిలోని కళకు, అభివ్యక్తికి, అభిరుచికి అనువుగా విద్యావ్యవస్థ ఉంటే సమాజం ఎంత గొప్పగా ఎదిగేదో" ఆవేదనగా అన్నాడు లచ్చయ్య.

"నేను నీతో ఏకీభవిస్తున్నాను" అని లక్ష్మయ్య అనడంతో చర్చ ముగిసింది. ఏదైనా ఏకీభవించాక చర్చ ముగుస్తుంది. కల్సి ఆచరించడమే మిగుల్తుంది.

ఆయా సందర్భాలు పురస్కరించుకొని స్కూల్లో బాలకవి సమ్మేళనం ఏర్పాటు

చేశాడు లచ్చయ్యసారు. గంగధరిని ప్రోత్సహించాడు. జిల్లా కేంద్రంలో జరిగిన టీచర్ల ధర్నా, దీక్షల కార్యక్రమాల్లో గంగధరిచేత పాటలు పాడించాడు. గంగధరికి చక్కని గుర్తింపు వచ్చింది. వేసవి సెలవుల్లో తమతోపాటు తన ఊరు తీసికెళ్ళాడు లచ్చయ్యసారు. అక్కడా బ్యాండు వాళ్ల స్నేహం చేసి సంగీతం నేర్చుకున్నాడు. టేలర్ షాపులో స్నేహం సంపాదించి టేలరింగులో ప్రవేశం సంపాదించాడు. సారును పైసలు అడగటం ఇష్టంలేక అప్పుడపుడు ఇటుక పనికి, బావుల తవ్వకానికి వెళ్లేవాడు. మామిడి తోటలవాళ్లతో, మేకల మందలవాళ్లతో చక్కని దోస్తానీ ఏర్పడింది. అతని పాటలంటే వారు చెవికోసుకునేవారు.



వర్షాకాలంలో బళ్లు తెరవడంతోనే లచ్చయ్యసారుకు ఆ స్కూలు నుండి మరో ఊరికి బదిలీ అయింది. లచ్చయ్య సారు వెళ్లిపోవడంతో గంగధరికి మళ్లీ స్కూలుకి వెళ్లబుద్ధి కాలేదు. అది తెల్సిన లచ్చయ్యసారు గంగధరిని కొన్నాళ్లపాటు తన వెంట తీసుకెళ్లాడు. ఇంటికొచ్చాక తిరిగి మొండికేయడంతో కొన్నాళ్లు చూసి గంగధరిని వెంకట్రావు దొర వద్ద జీతానికి ఉంచాడు ఎల్లయ్య. కొన్ని గేదెలు, మేకలు కాయడం, ఇంటివద్ద చిన్న చిన్న పనులు చేయటం గంగధరి పని. వెంకట్రావు మనుమరాలు హరిత గంగధరి ఆటపాటలకు ముగ్ధురాలై బడి ఎగ్గొట్టి గంగధరి వెంట, చెట్లు పుట్టలవెంట తిరగడం మొదలైంది. బిడ్డ కూతురు కావడం వలన మనుమరాల్ని ఏమీ అనలేక రెండుమూడు సార్లు గంగధరిని కొట్టాడు వెంకట్రావు. హరిత స్నేహంకోసం ఆ దెబ్బలు భరించాడు గంగధరి. ఇలా కాదని నాలుగు నెలలకే గంగధరిని పనికివద్దని వెళ్లగొట్టాడు వెంకట్రావు. ఎల్లయ్య కొడితే తిరగబడి తండ్రిని ఒక్కటి పుచ్చుకుని పరిగెత్తాడు గంగధరి. ఎల్లయ్య తిట్టిపోశాడు. కొన్నాళ్లు కడకడలు తిరిగి ఎవరికీ చెప్పకుండా మళ్లీ లచ్చయ్యసారు ఇంటికెళ్లిపోయాడు గంగధరి.

లచ్చయ్యసారు గంగధరిని కట్టికోత మిషన్‌లో పనికి కుదిర్చే ప్రయత్నం చేశాడు. అది వద్దని తనకు తానే మేకలు కాసే పనికి కుదురుకున్నాడు. గంగధరి పాటలు విని ఎవరో ఏవో సంఘం పాటలు నేర్పి కొద్దిరోజులు వెంట తీసికెళ్లారు. ఫలానా పాటలే పాడాలి అని సంగపోల్లు ఖచ్చితంగా చెప్పడంతో కొన్నాళ్లకు వారిని వదిలేసి వచ్చాడు. వచ్చేసరికి మేకలు కాసే పని పోయింది.

ఇల్లు కట్టే కూలిపనికి వెళ్లడం మొదలెట్టాడు గంగధరి. ఎప్పుడంటే అప్పుడు మానేసే ఆ పని హాయి అన్పించిందతనికి. మెల్లిమెల్లిగా సుతారి (తాపీ) పని నేర్చుకున్నాడు. ఓరోజు ఆ వూళ్లో సాధు సన్యాసుల వంటివారు విడిది చేశారు. తెల్లగా గడ్డం పెరిగిన ముసలాయన, అతని భార్య వారి శిష్యులు ఇద్దరు. వారేదో అచలతత్వ గురువులట. వారికి ఎన్నో ప్రాంతాల్లో శిష్య పరంపర ఉందట. ఆ శిష్య పరంపరను కలుస్తూ నిరంతర సంచారమే వారి జీవితమట.

ఆ గురువు పేరు పూర్ణానందస్వామి. పిలువరాక స్వామి అనీ, పాతపేరుతో రాజయ్య అయ్యగారు అనీ వ్యవహరిస్తారు జానపదులు. ఒక్కొక్కపూట ఆ వూళ్లోని ఒక్కో శిష్యుని ఇంట భోంచేస్తూ వారిచ్చే పూలో, పత్రో స్వీకరిస్తూ అపుడపుడు సాయంత్రాలు ఎవరింట్లోనో తత్వగీతాలు, ప్రసంగాలు చేస్తుంటారు. "ఈ భవ భావబంధాలు మాయ. ఈ కష్టసుఖాలు మాయ. ఈ దేహం ఉట్టి తోలుతిత్తి. దీన్ని చూసి అహం పెంచుకోవడం ఎందుకు? అందరూ మట్టిలో కలుస్తారు. మన మంచితనమే మనం మిగిల్చిపోయేది. అదొక్కటే సత్యం" అన్న ఆ గురువు మాటలు గంగధరిని బాగా ఆకర్షించాయి. ఆ భావాల్తో ఓ రోజంతా గునగునాయించుకొని ఆ సాయంత్రం సత్సంగ్‌లో తన పాటలు పాడాడు గంగధరి. ఎన్నో ప్రశ్నలు వేసిన గంగధరి తెలివితేటలకు గురువు ఆశ్చర్యపోయాడు. తనతోనే ఉండుమని కోరాడు.

తత్వగురువు బృందం వెంట ఎన్నో ఊర్లు తిరిగాడు గంగధరి. ఎన్నో అనుభవాలు సంపాదించాడు. గురుపత్ని అనారోగ్యంతో పోవడంతో గంగధరి పెద్ద దిక్కయ్యాడు. అపుడపుడు ఆరోగ్యం బాగులేనపుడు శిష్యవర్గం వెంట గంగధరిని పంపేవాడు. ప్రజలతో తత్వచర్చల్లో ఏవేవో మఠాలు, ఆశ్రమాలు ప్రస్తావించేవారు. అక్కడి గురువులను, ఆశ్రమాలను, తత్వాలను దర్శించాలనిపించి పూర్ణానంద స్వామివద్ద సెలవు తీసుకున్నాడు. అలా తిరగడంతో ఎన్నో అనుభవాలు.

ఇపుడు గంగధరికి కొన్ని సంస్కృత శ్లోకాలు, కొన్ని హిందీ, మరాఠీ గీతాలు, కొంత ఇంగ్లీషు వచ్చు. కబీరు, గురు రవిదాసు దోహాలు శ్రావ్యంగా పాడుతాడు. దేశంలోని ఒక అంతర్జాతీయ ఆశ్రమంలో పరిచయమైన రత్న అతన్ని ఆరాధించటం ప్రారంభించింది. గంగధరి మొదట్లో ఆ విషయం గమనించలేదు. మహారాష్ట్రలో స్థిరపడ్డ తెలుగు కుటుంబానికి చెందిన రత్న యాక్సిడెంటులో భర్తను కోల్పోయింది. ఆమె మనశ్శాంతి కోసం తల్లితండ్రులు చేయని ప్రయత్నం లేదు.

రత్న గంగధరిని తమ ఊరికి ఆహ్వానించింది. గంగధరి రత్న జీవితంలో వెలుగు

నింపితే బావుండునని తల్లిదండ్రులు ఆరాటపడ్డారు. గంగధరికి ఇంకా పెళ్లిమీదికి ధ్యాస పోలేదు. కొద్ది రోజులున్నాక తొలి తత్వగురువు పూర్ణానందస్వామి పైకి మనసు మళ్లింది. అడ్రసు తెలియదు. రత్నతో వీడ్కోలు తీసుకొని ఒంటరిగా పయనమయ్యాడు. ఎన్నో ఊళ్లు తిరిగాడు.

ఒసారి పల్లెలో నక్సలైట్లు తారసపడ్డారు. గంగధరి తన వివరాలు చెప్ప నిరాకరించాడు. రహస్య పోలీసేమోనని చితకదన్ని వదిలేసారు. విషాదంగా ఏవో తత్వగీతాలు పాడుకుంటూ స్పృహ కోల్పోయాడు. దళం వెళ్ళిపోయాక ఆ వూరివాళ్లు అయ్యో పాపం అని చేరదీశారు.

ఆ తర్వాత కొన్నాళ్లకు మరో ఊళ్లో పోలీసులు గంగధరిని అనుమానించారు.

"ఎవరు నువ్వు"

"నేనొక జీవిని"

"ఏం పేరు"

"ఇంకా తెలియదు"

"ఏ వూరు"

"అదే నా వెతుకులాట"

నక్సలైట్ల కొరియర్ అనుకొని చితకపొడిచారు. తన తత్వగీతాలు పాడుకుంటూ స్పృహ కోల్పోయాడు. అలాంటి తత్వాలు విన్న ఓ పోలీసు "వీడేదో తత్వ గురువులా ఉన్నాడు వదిలేద్దాం" అనడంతో ప్రాణాల్తో బయటపడ్డాడు.



ఓ సాయంకాలం బోరింగ్ వద్ద నీళ్లు తాగి చెట్టుకింద ఒరిగి తనలో తాను పాడుకుంటున్న గంగధరిని జీపు రేడియేటర్లో నీళ్లకోసం ఆగిన జీపులోని సమగ్ర గిరిజనాభివృద్ధి అధికారి గమనించి ప్రజలకోసం పాటలు పాడితే మంచిదని, తాము కొంత ప్రతిఫలం ఇస్తామని తీసుకెళ్లాడు. వారు చెప్పిన చోట్ల కార్యక్రమాలు ఇస్తూ కొన్నాళ్లు తిరిగాడు. అదంతా ఏదో యాంత్రికంగా వారి అధికారం కింద తన స్వేచ్ఛ కోల్పోయిన కూలీగా కనిపించి వారినించి సెలవు తీసుకొని తన గురువు వెతుకులాటలో పయనమయ్యాడు గంగధరి.

ఒక ఉదయాన్నే ఏదో ఊళ్లో మరో దళం ఎదురైంది. దళంలో ఎవరో అతన్ని గుర్తు పట్టారు. "అన్నా నీ పేరు గంగధరానే? ఏమనుకోకే! మా ఊర్లో నా క్లాసుమేటు గిట్లనే ఉండె. అతన్ని చూసి చాలాకాలమైంది. బతికిఉన్నడో లేడో కూడ తెలువది" అని అడిగాడు.

గంగధరి అతన్ని పోల్చుకోలేకపోయాడు. చిన్ననాటి విషయాలు పూర్వజన్మలా మసకబారిపోయాయి. ఔననాలో కాదనాలో తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయాడు. కొంత సమయం తర్వాత ఏదో తత్వంపాట ఎత్తుకోవటంతో ఆ దళ సభ్యుడు ఇతను గంగధరే అని నిశ్చయించుకున్నాడు. పాట అయిపోగానే అతడు గంగధరిని బిగ్గరగా కౌగిలించుకొని "నేనురా గంగధరీ సుధాకర్‌ను రా! మేకలు గాసుకుంట మనం చెట్లుగుట్టలు తిరిగినం" అంటూ ఆనందభాష్పాలు రాల్చాడు.

సుధాకర్ ద్వారా గంగధరికి ఇంటి విషయాలు చాలా తెలిశాయి. తండ్రి ఎల్లయ్య చనిపోయి రెండేండ్లయింది. తల్లి బూదవ్వ ఎప్పుడూ గంగధరినే కలవరిస్తుంది. గంగధరి చెల్లెలుకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. ఆమె భర్త ఉపాధికోసం అరబ్బు దేశాలకు వెళ్లాడు. లచ్చయ్యసారు లెక్చరర్‌గా ప్రమోషన్ తీసుకున్నాడు. ఆ సారు అపుడపుడు గంగధరిని గుర్తు చేస్తుంటాడు. లచ్చయ్యసారు భార్య మల్లేశ్వరి స్త్రీల రిజర్వేషన్ సీట్లో మండలాధ్యక్షురాలిగా ఎన్నికయింది. ఊళ్లో కొత్తగా షిర్డీ సాయిబాబా గుడి కట్టారు. గంగధరి దగ్గరి దోస్తు రాజయ్య సెంట్రింగ్ పనిచేసి కాంట్రాక్టు పట్టి ఇండ్లు కట్టించే పెద్ద కాంట్రాక్టరుగా ఎదిగాడు. ఆ ఊరి సర్పంచయ్యాడు. వెంకట్రావు దొర చనిపోయి చాలా కాలమైంది. వెంకట్రావు మనుమరాలు హరితకు ఇద్దరు పిల్లలు. ఆమె భర్తను దళం చంపేసింది. ఆమె ఇపుడు అమ్మమ్మగారిల్లయిన వెంకట్రావు దొర ఇంట్లోనే ప్రయివేటు స్కూలు నడుపుతోంది. అపుడపుడు గంగధరిని హరిత గుర్తు చేస్తుంది. హరితను సుధాకర్ విధవా వివాహం చేసుకుందామనుకున్నాడు. హరిత సరేనంది. పార్టీ అంగీకరించలేదు.

హరిత విషయం రాగానే గంగధరికి రత్న మనసులో మెదిలింది.

"ఎవరికీ చెందని ఈ ఒంటరి జీవితం నీకు విసుగనిపించడం లేదా? ఇంత ఒంటరి ఈ జీవితాన్ని ఎలా జీవించగలుగుతున్నావు? పదిమందిలో కలిసి ప్రజలకోసం ఏదైనా మంచి పని చేయరాదా?" అన్నాడు సుధాకర్.

గంగధరి నవ్వాడు. అది విషాదం కాదు. వ్యంగ్యమూ కాదు. అదొక ప్రసన్నత.

"నీవు చేసే విప్లవ పోరాటం ప్రజలకోసమేనా? అయితే అందులో ప్రజల ఇష్టాఇష్టాల స్థానమెంత?" సూటిగా అడిగాడు గంగధరి. మళ్లీ తనే కొనసాగించాడు.

"విప్లవం అనేది నీ కోరిక. నీ కోరికను ప్రజల కోరికగా మార్చాలనేదే నీ సిద్ధాంత పోరాటమంతా! కాదంటావా? నీ కోరికల్ని ప్రజలమీద రుద్దుతున్నావు. ప్రజలు కొందరు ఔననడంతో అది ప్రజలకోరిక అని మభ్యపెడుతున్నావు. నీవు ప్రజలకోసం పనిచేయడం అంటే ఏమిటి? నీవంటూ నీకే కోరికలు లేని స్థితికి నీవు చేరుకున్నప్పుడు కదా నువ్వు ప్రజలకోసం పని చెయ్యడం సాధ్యపడేది. అంటే నీ కోరికల్ని నీవు జయించావా? నిన్ను నీవు జయించావా? నీ మనస్సును నీవు, నీ కోరికల్ని నీవు జయించటంలో ఉన్న ఆనందాన్ని నీవు అనుభవిస్తున్నావా? సుఖ సంతోషాలు అంటే ఏమిటి? వస్తువుల్ని కోరుకోవటమే సంతోషమా? నీవు కోరుకున్న విధంగా నేను, ఇతరులు ఉంటే అది నీ సంతోషం అవుతుంది. అది నాకు ఆనందం ఎలా ఇస్తుంది. బుద్ధుని బోధనలు చదివావా? అసలు స్వేచ్ఛ, ప్రేమ, కరుణ అంటే ఏమిటి"?

సుధాకర్ కాస్త తడబడి తనకు తెల్సిందంతా ఏకరువు పెట్టాడు. ఈ భౌతిక జీవితాన్ని మించిన మరో జీవితం లేదని నొక్కి చెప్పాడు.

"ఆ మాట నేను కాదనలేదే? నేను చర్చిస్తున్నది కూడా భౌతిక జీవితాన్నే కదా! మనిషి గురించే నేను చర్చిస్తున్నది" అన్నాడు గంగధరి.

ఆ చర్చ ఆసక్తికరంగా ఉండటంతో ఇపుడు టైం లేదని ఒక వారంపాటు తమతో ఉండుమని, చర్చిద్దామని దళంకోరి అక్కణ్ణుంచి బయల్దేరింది. గంగధరి వారివెంట నడిచాడు.

వారం రోజుల్లో దళంలోని ప్రతి ఒక్కరిని "నీ మనస్సుని నీవు జయించావా? మనస్సంటే ఏమిటి? స్వేచ్ఛ అంటే ఏమిటి? సమాజం అంటే ఏమిటి? ఈ బంధాలంటే ఏమిటి? ఈ భవభావ బంధాలనుండి విముక్తి కాకుండా నిజంగా విముక్తి, స్వేచ్ఛ సాధ్యమేనా?" అనే ప్రశ్నలే వెంటాడాయి. గంగధరి వారికి ఎలాంటి జవాబులిచ్చే ప్రయత్నం చేయలేదు. దళ కమాండరు ఆ చర్చల్ని భావవాద అన్నాడు.

"మనస్సనేది చైతన్యం అయినపుడు చైతన్యం నుండే దృక్పథాలు, సిద్ధాంతాలు, కోరికలు పుడ్తున్నప్పుడు మనస్సు గురించి చర్చించటం భావవాదం ఎలా అవుతుంది?" అని ప్రశ్నించాడు గంగధరి.

ఒక పరి ఆ చర్చల్లో ఆ ఏరియా దళాల డివిజన్ కార్యదర్శి పాల్గొన్నాడు. ఎవరికీ వాటి దరి దొరకలేదు. గంగధరి చెప్పలేదు. భావవాదుల్లా, సన్యాసుల్లా కనపడే ఈ తత్వ గురువులు ఇంత లోతైన చర్చ చేస్తారా అని వారికి తొలిసారిగా అనుభవమైంది. ఏవో అటవీ ఏరియా డివిజనల్ స్థాయి మీటింగులున్నాయని డివిజన్ కార్యదర్శి అనడంతో తనను వీడ్కోలు తీసుకోమంటున్నారని గ్రహించి గంగధరి వారి నుండి సెలవు

తీసుకున్నాడు. మళ్లీ తన తొలి తత్వగురువు వెతుకులాటలో పడ్డాడు.

ఏదో ఊళ్లో గురువుగారి గురించి తెల్సింది. నిరుడు ఆ వూరు వచ్చాడట. గంగధరిని గుర్తు చేశాడట. ఆయన ఆరోగ్యం బాగా నీరసించింది. ఇక మళ్లీ మీ ఊరు రాగలనో లేదో అన్నాడట. ఎక్కడో ఎక్కడెక్కడి శిష్యులంతా కలిసి ఆయనకోసం ఒక ఆశ్రమం కట్టించారట. త్వరలోనే ఆ ఆశ్రమం పట్టుకున్నాడు గంగధరి. రాజయ్య గురువు బాగా చిక్కిపోయారు. వయసు పైబడిపోయింది. గంగధరిని చూసి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. నా బిడ్డ నన్ను వెతుక్కుంటూ వచ్చాడని ఆనందభాష్పాలు రాల్చాడు.

ఆశ్రమంలో అంతా కలిసి పదిమందిదాకా వున్నారు. చక్కని ప్రశాంత వాతావరణం. చుట్టూ చెట్లు, నడుమ అన్ని సౌకర్యాలు గల నాలుగు గదులు, ఒక హాలు, ఒక పందిరి. ఆశ్రమం అంటే అలా ఉండాలి అనేట్టుగా వుంది. సాయంత్రం ఎవరో భక్తిగీతాలు ఆరంభించారు. గురువు వారించాడు.

"దేవుడెక్కడ ఉన్నాడు నాయనా! లేని దైవం కోసం వెతుకులాట దేనికి? దైవం ఒక మాయ. మనస్సుని జయించని వారే దేవుణ్ణి సృష్టించి తన కోరికల్ని తీర్చమన్నారు. నీ కోరికల్నించే నీ దైవం పుట్టడం. నీ మనస్సే దైవం. నీ మనస్సే సైతాను. ఈ రెండూ ఎక్కడో లేవు. నీ మనస్సులోనే ఉన్నాయి నాయనా".

తత్వగురువులో వచ్చిన ఈ మార్పుకు గంగధరి సంతోషపడిపోయాడు. బుద్ధుడు చెప్పిందీ ఇదే. ఇదే తత్వంతో రాసి పాడుతూ వస్తున్న కొన్ని పాటల్ని కంజీర కొడ్తూ శ్రావ్యంగా వినిపించాడు గంగధరి.

రోజులు గడుస్తున్నాయి. శిష్య మిత్రులు వస్తూ వెళ్తూ వున్నారు. వారితో గంగధరి చేస్తున్న తత్వచర్చలు గురువుగారికెంతో సంతోషం కలిగించాయి. ఎంత ఎదిగిపోయాడు గంగధరి. పొద్దున్నే లేస్తాడు. ఆశ్రమంలో తోటపని, పరిశుభ్రత పని, వంటపని చూస్తాడు. కట్టెలు కొట్టుకొస్తాడు. లెట్రిన్లు కడుగుతాడు. ఒక్కటేమిటి.......గంగధరి ఉత్సాహం, ఉల్లాసం చూస్తుంటే గురువుగారి ఆరోగ్యం కుదుటపడసాగింది. ఇన్నాళ్లూ తనకు వారసుల్లేరని బెంగ పెట్టుకున్నాడు. ఇపుడా బెంగ తీరిపోయింది.

ఓరోజు ఉదయం వేడి అంబలి తాగుతున్నారు. గురువు చుట్టూరా శిష్యులు కూర్చున్నారు. ఎవరో సంసారం, సన్యాసం అనే అంశాలపై చర్చ లేవనెత్తారు.

"నిగ్రహానికి, వ్యామోహానికి ఉన్న తేడాయే సన్యాసానికీ, సంసారానికి ఉన్న తేడా" అన్నాడొక శిష్యుడు.

"సన్యాసిలా సంసారం చేయగలగటమే అసలైన జీవితం" అన్నారు మరొకరు.

"అదే జరిగిననాడు ఈ లోకం ఎంత ప్రేమ మయమవుతుందో" అన్నారు ఇంకొకరు.

తర్జనభర్జనలు జరిగాయి. గురువుగారు వింటూ కూర్చున్నారు. సందర్భాన్ని చూసి

గంగధరి తన మనస్సులోని మాట అందరి ముందుంచాడు.

"నేనూ రత్న కల్సి ఉండాలనిపిస్తోంది. మీ అభిప్రాయం ఏమిటి?"

"రత్న తన పిల్లల్ని తల్లిదండ్రులవద్ద ఉంచి రాగలిగితే ఇక్కడ ఆమె మనలో ఒకరవుతారు".

"బౌద్ధం చెప్పిన బ్రహ్మచర్యం మాటేమిటి?" ఎవరో ప్రశ్న లేవనెత్తారు.

"ఈ జీవి జీవించటంకోసం చేసే సంసారం సన్యాసం. ఈ సంసార భవబంధాల మాయకోసమే జీవించడం సంసారం. బౌద్ధం చెప్పిన సన్యాసం గొప్పది. సంసారంలో సన్యాసిగా జీవించడం మరింత గొప్పది. అందుకే బౌద్ధం నశించి హిందూ ధర్మం బతికి ముందుకు సాగగలిగింది.

దీనిపై మళ్లీ తర్జభర్జనలయ్యాయి. ఏదీ ఇదమిద్ధంగా తేలలేదు. అలా తేల్చడం పాక్షిక దృష్టి అవుతుందని దాన్ని అలాగే వదిలివేస్తారు.

గంగధరి రత్నను తీసుకొని వచ్చాడు. రత్న రాకతో ఆ ఆశ్రమంలో ఒక వెలుగు ప్రవేశించింది. అవ్వకు తను బతికి ఉన్నట్టు తెలిస్తే తల్లి మనసు కుదుట పడ్తుంది. రత్నతో కలిసి కొద్దిరోజులు వెళ్లివస్తానని గురువుగారి ముందుంచాడు గంగధరి.

"అక్కడికి వెళ్తే ఎందరెందరో నీ పాత బంధుమిత్రులు కలుస్తారు. ఎంత కాలానికి తిరిగివస్తావో. మీ ఎడబాటు నాకు కష్టంగా ఉంటుంది నాయనా! ఈ వృద్ధాప్యంలో మీ అమ్మ మీతోపాటే ఇక్కడే ఎందుకుండగూడదు" ఉత్తరం రాస్తే రెక్కలు కట్టుకొని వాలదా? లేదా మరో శిష్యున్ని పంపుదాం" అన్నారు గురువుగారు.

గంగాధరితల్లి బూదవ్వ బట్టలు సర్దుకొని వచ్చి ఆశ్రమంలో చేరి ఆశ్రమవాసిగా మారిపోయింది. గంగధరి జాడ ఆ నోట ఈ నోట విన్న హరిత ఒకటి రెండుసార్లు ఆశ్రమానికి వచ్చివెళ్లింది. లచ్చయ్య, లక్ష్మయ్యసార్లు కలిసి గంగధరిని, గురువుగారిని అభినందించి వెళ్లారు.

కార్తీక పౌర్ణమి రోజు ఎక్కడెక్కడినుంచో శిష్యులు వచ్చారు. అందరి వసతి ఏర్పాట్లలో రత్న, గంగధరి ఉన్నారు. ఆరోజు మూడు వందల శిష్యబృందం గురువుతో కొలువుదీరింది. పరస్పర పలకరింపులు. అంతా కోలాహలంగా వుంది.

"మీరు పోయాక ఈ ఆశ్రమాన్ని ఎలా నడపాలనుకుంటున్నారు" అని సీనియర్ శిష్యుడు గురువు అంతటి వయసు గలాయన ప్రశ్నించాడు.

"అది మీ అందరి వివేచనకు సంబంధించిన విషయం" అని గురువుగారు ఆచర్చకు జవాబు చెప్పకుండా సున్నితంగా తప్పుకున్నారు. కొంతసేపు చర్చ జరిగింది. పనుల మధ్యలో అటు వచ్చిన గంగధరి తన మనస్సులో మాట అందరి ముందుంచాడు.

"నిజమైన స్వేచ్ఛ కోసమే మానవులు పరితపిస్తున్నారు. నిజమైన స్వేచ్ఛ, స్వచ్ఛమైన మానవీయ ప్రేమ, కరుణ విలసిల్లే ప్రపంచంలాంటి స్కూలు ఒకటి ప్రారంభిద్దామా?"

తన జీవితాన్ని దృష్టిలో ఉంచుకొని అన్నాడు గంగధరి.

"నిజమైన స్వేచ్ఛ ప్రేమ, కరుణ ఇక్కడ తెల్సుకొని అనుభవించి వెళ్లినవారు బయటి ప్రపంచంలో బతకగలరంటావా?" ఒక శిష్యుడు అనుమానించాడు.

ఆ విషయం తనకు తట్టనందుకు ఆశ్చర్యపోయాడు గంగధరి. గురువుగారి సందేశం కోసం అభ్యర్థించాడు.

"నాయనా నీవనుకుంటున్న పద్ధతి సరైంది కాదు. ఈ లోకం సత్యం. ఈ స్వార్థం, అసూయ, భవభావబంధాలు, ఆధిపత్యం, రాజ్యం ఇవన్నీ సత్యమే. అయినా ఇవన్నీ మాయ. తన స్వార్థంతో వీటిల్లో కూరుకుపోవడం మాయ. స్వార్థం నుండి విముక్తమై వీటన్నిటా ఉంటూనే సన్యాసిలా జీవించడమే ఈ మాయనుండి విముక్తం కావడం. అదే నిజమైన స్వేచ్ఛ, స్వచ్ఛమైన ప్రేమ, కరుణ.దాన్ని కొందరు రాజయోగిజీవితం అని, కొందరు అచలతత్వయోగి అనికూడా అంటారు. ఏ పని చేయకుండా కొందరిలా బొర్రలు పెంచి మఠాలు, ఆశ్రమాలు నడపటం, ఆశ్రమాల ఆస్తుల్ని పెంచుకుంటూ శిష్యుల్ని దోపిడీ చేస్తూ పోవడం స్వార్థం. పనిపట్ల ఆనందమే బ్రహ్మానందం. గురు రవిదాసు ఎంత గొప్ప తత్వగురువైనా తత్వబోధ చేస్తూ చెప్పులు కుట్టి బతుకుతూ దేశాటన చేసిన నిగర్వి. బ్రహ్మజ్ఞానం ఎవరి వద్దోలేదు. ఎక్కడో లేదు. అది శూద్రుల్లో ఈ చిల్లర కులాల్లోనే వుంది. బ్రహ్మ జ్ఞానం అంటే సృష్టించటంలో పొందే ఆనందం. సమస్త వస్తువుల్ని, సంపదల్ని సృష్టించేది కింది జాతులవాళ్లే. అందువల్ల కింది జాతులవాళ్లే బ్రహ్మజ్ఞానులు. బ్రహ్మానందం అంటే వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు".

"బ్రహ్మజ్ఞానం పొందినవారే బ్రాహ్మణులు అనే మాటేమిటి." ఎవరో శిష్యులు ప్రశ్నించారు.

"అది తప్పు నాయనా! బ్రహ్మజ్ఞానం పొందినవాళ్లే శూద్రులు, చిల్లర జాతులు. ఈ ప్రకృతిలో లీనమయ్యే ఏ వృత్తీ చేయని బ్రాహ్మణజాతికి బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం లభించడం ఎలా సాధ్యం? ఈ భేషజాలకు బ్రహ్మజ్ఞానం, బ్రహ్మానందం ఆమడదూరం ఉంటుంది. ఈ ఆధిక్యత, అహంకారం వదులుకున్న వారికే అది సాధ్యం. అదే బ్రహ్మజ్ఞానం. అదే ఈ మాయ నుండి విముక్తం కావటం. స్వార్థం, అసూయ, భవభావ బంధాలు, నేను గొప్ప, ఇది నాది, ఇది నాది కాదు అనే ఈ లోకంలో వీటన్నిటి మధ్య జీవిస్తూనే మానవులు ఈ మాయ నుండి బయటపడటమే అసలు నిర్వాణం. అదే అసలు సన్యాసం. అదే రాజయోగితత్వం. అదే బుద్ధుడు చెప్పిన జీవితం. ఏదీ నీది కానపుడు అన్నీ నీవే అవుతాయి అని చెప్పిన బుద్ధుని మాట గొప్పమాట. గంగధరి కోరుతున్నది విడిగా ఉండే ఆదర్శ ప్రపంచం. అది ఎప్పుడూ సాధ్యం కాదు. ఈ లోకంలో అన్నిటా ఉంటూనే లోక కళ్యాణం.కోసం అన్ని పనులూ చేస్తూనే ఏదీ తనది కాదు అనే స్థితికి తన ఆత్మను, మనసును జయించడం గురించే మనం చెప్పవలసింది. ఈ భార్యాబిడ్డలు, ఈ ఆస్తిపాస్తులు, అధికారం, పేరు ప్రతిష్టలు, కులం, మతం ఈ దేహంతోపాటు నీ భావాలపై కూడా ఇది నాది అనే ఆస్తి హక్కులేని అభావ స్థితికి

చేరుకోవడమే ఈ మాయ నుండి విముక్తి కావడం. అపుడే నిజమైన స్వేచ్ఛ. స్వచ్ఛమైన ప్రేమ, కరుణ, ఆదర్శ ప్రపంచం, నిజమైన సోషలిజం అనుభవంలోకి వస్తుంది. బుద్ధుడు, కబీరు, గురు రవిదాసు చెప్పిన సారం ఇదే నాయనా! అదే ఈ కార్తీక పున్నమి సందేశం".

తర్జన భర్జనలు జరిగాయి. తనకు తాను స్వేచ్ఛగా తెల్సుకునే పరిస్థితులు, అవకాశాల్తో ఆసక్తి, అభిరుచి కలిగించేదిగా ఉండడమే సరైన సహజ విద్యావిధానం అని ఏకాభిప్రాయానికి వచ్చారు. శిష్యులు ఆ స్కూలు ఏర్పాట్లకు సహకరించడానికి వాగ్దానాలు చేశారు. గురువుగారు శుభస్య శీఘ్రం అన్నారు.

ఏర్పాట్లు చురుకుగా సాగాయి. బౌద్ధ పౌర్ణిమ రోజున శిష్యులంతా ఆశ్రమం చేరారు. బూదవ్వ చేతులమీదుగా స్కూలు ప్రారంభించబడింది. గురువుగారు జ్యోతి వెలిగించారు. లచ్చయ్య, లక్ష్మయ్యసార్ల సూచనలపై ఆ స్కూలుకి 'విద్యా పరిశోధన కేంద్రం' అని పేరు పెట్టారు.

పేద విద్యార్థులకే పరిమితమైన ఆ స్కూలు చక్కగా నడుస్తోంది. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు నుండి హాస్టల్ విద్యార్థులకిచ్చే మెస్ ఛార్జీల స్టయిఫండ్‌ను లచ్చయ్యసారు మంజూరు చేయించే కృషి చేశాడు. అధికారులు ఆ స్కూల్‌ను అభినందించారు. కొన్నాళ్లకు బూదవ్వ తృప్తిగా కన్నుమూసింది.

లచ్చయ్య, లక్ష్మయ్యసార్ల ప్రోత్సాహంతో ఆశ్రమంలో విద్యపై వారం రోజులపాటు సెమినార్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. లక్ష్మయ్యసారు ఒక విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రారు హోదాకు చేరుకోవడంతో ఆ సెమినారుకు ఏవేవో గ్రాంట్స్ తెప్పించడంతోపాటు వారి విశ్వవిద్యాలయం సహకారంతో ఉమ్మడిగా నిర్వహించే కార్యక్రమంగా రూపొందించబడింది.

ఆ సెమినార్‌లో రస్సెల్, ఫ్రావెల్, మెండెల్, మార్క్సు, జె.కె, ఎరిక్‌ఫ్రాం, టాగోర్, గాంధీ, అంబేద్కర్, మావో, గిజుబాయి, బుద్ధుడు, వర్ణవ్యవస్థలోని గురుకులం, కులవ్యవస్థ, పూలే మొదలుకొని రైలుబడి, పంతులమ్మకు ప్రేమలేఖ, బాలసాహిత్యందాకా ఎన్నో అంశాలు చర్చించబడ్డాయి. ఆశ్రమ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆశ్రమ శిష్య పరంపరతోపాటు ఎందరో ఆ చర్చల్లో పాల్గొన్నారు. ఎన్నో అనుభవాలు....... ఎన్నో ప్రయోగాలు........ఎన్నో అనుభూతులు. అందరిలో ఒక స్కూలు అవగాహన స్పష్టంగా రూపుదిద్దుకుంది.

దేశంలోని పలు విద్యాలయాల్ని సందర్శిస్తూ గురువుగారి శిష్యులవద్ద, ఆశ్రమంపట్ల గౌరవం గలవారివద్ద విరాళాలు సేకరిస్తూ కొన్నాళ్లు దేశాటన గావించాడు గంగధరి. ఆశ్రమాన్ని ఆనుకొని వున్న నలభై ఎకరాల బీడును కొన్నారు. సత్కార్యానికి రైతులు ధరలో సహకరించారు. దాని చుట్టూ కంచెవేసి పళ్లు, కూరగాయల తోటగా అభివృద్ధి పరిచారు ఆశ్రమ విద్యార్థులు. ఆశ్రమం ఒక సహజ ఉద్యానవనంగా అభివృద్ధి చెందింది.

ఆటపాటలు, పనిపాటలు, కలగలిసిన ఆశ్రమ విద్య విద్యార్థుల్లో జీవితమే ఒక ఆట అనే ఆనంద దృక్పథాన్ని కల్గించింది. అన్ని పనులూ వారొక ఆటలాగే నేర్చుకునేవారు. ఒకరోజు పిల్లల్లతోపాటు పొద్దంతా పనిచేసి అలిసిపోయిన గంగధరి ఆయాసంగా ఉందంటూ వేళకన్నా ముందుగానే మేనువాల్చాడు. అలసటలో ఏదో తృప్తి. దేహమంతటా ఏదో తేజస్సు ప్రవహిస్తున్నట్టయింది. ఎన్నాళ్లుగానో తీరని ఒక అసంతృప్తితో కూడిన అన్వేషణ అనే జ్వాలే విస్తరిస్తూ తనని ఇంతకాలం నడిపిస్తూ వస్తోంది అని అకస్మాత్తుగా తోచింది గంగధరికి. ఏదో తీరని తీక్షణ గూఢ అసంతృప్తేదో కోరికలా హృదయం అట్టడుగున జ్వలించకుండా జీవితంలో ఎవరూ ఏమీ సాధించలేరా అనే కొత్త ప్రశ్న ప్రవేశించింది. బుద్ధుడు, కబీరు, రవిదాసు, వేమన, పోతులూరి, జె.కె, ఫూలే, అంబేద్కర్ వీరందరినీ ఆ జ్వాల నడిపించిందా? ఆ అసంతృప్తి జ్వాలనే తృప్తి అనే తేజస్సుగా, దృక్పథంగా మార్చుకునే మార్గాల్నే వారు కనుక్కున్నారా? ఆ రాత్రి అలా ఎంతసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడో! ఎపుడు నిద్రపట్టేసిందో....నిద్రలోనే ఎపుడు కన్ను మూసాడో ఎవరికీ తెలియదు. కొందరు గుండెపోటన్నారు. కొందరు మెదడు నరాలు చిట్లాయన్నారు. లేపబోయిన రత్న ఏడుస్తూ బేల అయిపోయింది. తత్వగీతాలతో ఆశ్రమంలోనే దహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ విద్యార్థులు గంగధరికిష్టమైన పాటల్తో నివాళి అర్పించారు.

"ప్రపంచానికి వెలుగునీయాల్సినవాడు ప్రపంచం చీకటిలో వుండగా వెళ్లిపోయాడు" అంటూ గురువుగారు కన్నీరు పెట్టుకున్నారు. విశ్వవిద్యాలయంగా అభివృద్ధి పర్చాల్సినవాడు విద్యాలయాన్నే వదిలివెళ్లాడని లచ్చయ్య, లక్ష్మయ్యలు కంటతడి పెట్టారు.

గంగధరిమీద రంధితో గురువుగారు ఎన్నాళ్లో బతకలేదు. పాత శిష్యులు మళ్లీ ఒక్కటై ఆశ్రమంలో గురువుగారి సమాధి మండపం కట్టించారు. మెల్లిమెల్లిగా రామకృష్ణ, సాయి భజనలు మొదలయ్యాయి. రత్న ఒంటరిదైపోయింది. అందరూ పూనుకోకపోతే ఇక ఎన్నాళ్లో ఆశ్రమంలో స్కూలు సాగదని రత్నకు అర్థం కాసాగింది.

హరితను తోడు రమ్మంది రత్న. హరిత తన అశక్తను వెల్లడి చేసింది. ఆమె నడుపుతున్న స్కూలు ఏడో తరగతిదాకా ఎదిగి మూడు వందల విద్యార్థుల్తో కళకళలాడుతోంది. ఈ ఆదర్శాలకోసం దాని బంధాల నుండి బయటకు రావడానికి ఆమెకు ఇష్టం లేకపోయింది.

వాలంటరీ రిటైర్మెంటు తీసుకొని ఆశ్రమంకోసం తమ శేషజీవితాన్ని అర్పించవలసిందిగా లచ్చయ్య, లక్ష్మయ్యలను రత్న కోరింది. వాళ్లు అందుకు సిద్ధం కాలేకపోయారు. ఆదర్శాలు వేరు. వాటిని ఆచరించటం వేరు. సమాజంలో మరింత గుర్తింపు పొందాలనే మాయనుండి, సౌఖ్యాల వ్యామోహాల నుండి వారింకా బయట పడలేకపోవడంతో రత్న నిరాశ చెందింది.

గురువుగారి పాత శిష్యుల సూటిపోటి మాటల్తో ఒంటరి రత్న గుండె బెదిరిపోయింది. మిగతా శిష్య బృందానికి ఆశ్రమాన్ని వదిలిపెట్టి రత్న వెళ్లిపోయింది.

కొన్నాళ్లకు ఆశ్రమం పాడుబడిపోయింది. "విద్యా పరిశోధన కేంద్రం" అనే బోర్డు ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టుగా ఆశ్రమం గేటు పక్కన తెగిపడిపోయింది. అది చెత్తలో కూరుకుపోయింది. విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. తోట బీడుపడిపోయింది.

ఇపుడా ఆశ్రమం పాత శిథిలాల్లా అటు నుండి వెళ్లేవారికి దర్శనం ఇస్తూ ఉంటుంది. అపుడపుడు గురువుగారి సమాధి దర్శనంకోసం వారి పాత శిష్యులు అటుకేసి వస్తుంటారు. అపుడు దారంట వెళ్లేవారికి ఆశ్రమం నుండి ఏవేవో భక్తి, భజన గీతాలు లీలగా విన్పిస్తుంటాయి.

(సంత్ రవిదాసు, నర్సన్న, తత్వ గురువుల మాతృకలైన సోదరుడు
రాజనర్సు–పెద్దనాన్న మిట్టపెల్ల రాజయ్య (కోరుట్ల) గారల స్మృతికి)

**– మే '97, విపుల మాసపత్రిక, (రచనా కాలం: నవంబర్ (1996),**

**– కథాసాగర్, కథల సంపుటి (2000)**